# 'పఠన వ్రత దీక్ష'

పుస్తకం నారీ విత్తం పరహస్తం గతం గతః

అథవా పునరా యత్తం జీర్ణ భ్రష్టో వినశ్యతిః-

అన్న పాతకాలపు మాట అందరికీ తెలిసిందే. ఇందులో స్త్రీ విషయాన్ని పక్కనుంచి పుస్తకం కానీ, డబ్బుకానీ యిచ్చి చూడండి. పుస్తకమైతే నలిగో చిరిగో, డబ్బైతే ఇన్‌స్టాల్మెంట్లలో వస్తుంది.

సరే యివి డబ్బు రోజులు గనక. డబ్బు గురించి ఎవరి జాగ్రత్తలు వాళ్లు తీసుకుంటున్నారు. ఓ పక్క లక్షలకు లక్షలు సహకార బ్యాంకుల ద్వారా చిట్టీల ద్వారా మునుగుతూనే ఉన్నారు.

నాకు డబ్బు లేదు. పైగా బ్రహ్మచారిని కాబట్టి నా బాధల్లా పుస్తకం గురించే... ఎన్ని కంప్యూటర్లొచ్చినా, ఎంతెంత సాంకేతికత పెరిగినా పుస్తకం విలువ పుస్తకానిదే... కంప్యూటర్ మానిటర్ని హాయిగా పడక్కుర్చీలో కూచుని గుండెలమీద వెచ్చగా బోర్లించుకుని పడుకోగలమా. ఎవరిమీదైనా కోపమొస్తే పుస్తకాన్ని విసిరికొట్టినట్టు సీడీని విసిరేయగలమా?

ఏదేమైనా ఒకప్పటి విలువ పుస్తకం ఇప్పుడు కోల్పోయిందన్నది మాత్రం వాస్తవం. పుస్తకాన్ని పూజించే రోజులు పోయాయి.

పండగలు పండగల్లా కాకుండా పోయిన ఈ రోజుల్లో ఏదో సరస్వతీ పూజ రోజున నామమాత్రంగా పుస్తక పూజ జరుగుతోంది. (జరుగుతోందా?)

పుస్తకాన్ని మర్యాదించడమంటే, దాని కర్త అయిన రచయితనో కవినో గౌరవించడం కాదూ... ఆ కవో రచయితో ప్రత్యక్షంగా మనముందుకు రాలేక తన మస్తిష్కాన్ని పుస్తకంగా మార్చి తాను అందులోకి ప్రవేశించి మన దగ్గరికి వచ్చినట్టు కాదా? మనం అభ్యుత్థానం చేసి సకల మర్యాదలూ చేయక్కర్లేదు. కనీస గౌరవం!

మనింట్లో మనెదురుగా షేక్స్పియరూ, కృష్ణశాస్త్రీ, ఉమర్ ఖయ్యాం, కాళిదాసూ ఏక పంక్తిని కూచోడం ఎలా సాధ్యపడిందీ? వాళ్లందరూ పుస్తక రూపంలో అవతరించబట్టే కాదూ..?

పోయింది, పోయింది, పుస్తకానికి మర్యాద పోయింది. తద్వారా వాటి కర్తలకూ

పోతోంది. మొన్నటికి మొన్న ఆదివారం మా పేపరు సాయిబు క్యారియర్కి కట్టబడిన పుస్తకాల దొంతరలో సాయిబు బిగదీసి కట్టిన తాటికి ఉక్కిరిబిక్కిరి అవుతూ ప్రముఖ చిత్రకారులు శ్రీ కుంచె రాజయ్యగారి పుస్తకం 'కుంచె పదాలు' కనిపించింది. ఎంతటి మహోత్కృష్ట కళాకారుడాయన అయ్యో!

ఇక్కడ అబ్బూరి వరద రాజేశ్వరరావు 'కవన కుతూహలం' పుస్తకానికి అజంతా రాసిన ముందుమాట కచ్చితంగా ఉటంకించాల్సిందే. అవధరించండి (మొత్తం కాదులెండి... అక్కడక్కడా అంతే)

"పుస్తక పఠనానికి సంబంధించి, పఠనా ప్రక్రియలో పాటించవల్సిన నియమ నిష్ఠాదికాలకు సంబంధించి, ప్రముఖ ఇటాలియన్ రచయిత కాల్వినో అత్యంత రసవత్తరంగా సూచించినట్టు (ఈ పుస్తకాన్ని ఆస్వాదించబోయే ముందు ఏకాంతం, ఏకాగ్రత అవసరం గనక, పుస్తకం చేతబట్టుకున్న తర్వాత మీ మనసులో యితరత్రా మరేవిధమైన ఆలోచనలకు ఎంత మాత్రం అవకాశమివ్వకూడదు. మీరూ పుస్తకం తప్ప మరో ప్రపంచం లేదు. ఉండదు. ఉండకూడదు. అసలు మీరు పుస్తకాన్ని ఎలా పట్టుకుంటారు? ఏం భంగిమలో చదువుతారు? ఏ భంగిమైనా ఏకాగ్రతకు భంగం వాటిల్లకుండా జాగ్రత్తపడడం ముఖ్యం/ శుద్ధి కార్యక్రమంలో మనస్సుతోపాటు శరీరాన్ని కూడా శుచిగా ఉంచుకోడం ముఖ్యం గనక ఉదయం కావచ్చు, మధ్యాహ్నం, సాయంత్రం లేక అర్ధరాత్రి కావచ్చు. ఏ వేళలోనైనా స్నానాదికాలు నిర్వర్తించుకుని, నిష్ఠాగరిష్ఠులై, పఠన వ్రతదీక్షాబద్ధులై వాగ్దేవి పాదపీఠం ముందు, వినమ్రులై పరిశుభ్రమైన చేతుల్లో పుస్తకాన్ని పట్టుకుని... "అదండీ అజంతా రాసింది... మరీ అంతలేకపోయినా పుస్తకానికిచ్చే మర్యాద పుస్తకానికిస్తూ... పుస్తకాలు చదువుతాం...

ఇంతకీ ఈ అబ్బూరి వరద రాజేశ్వరరావెవ్వరూ?... ఈ అజంతా ఎవ్వరూ ఈ 'కవన కుతూహలం' ఏమిటి అని ప్రశ్నించే వాళ్లు మీకు తారసపడితే ఆశ్చర్యపోనక్కర్లేదు. "అబ్బూరి పేరు విన్నానుకానీ 'కవన కుతూహలం' ఆయన కవితా సంకలనమా?" అని ఓ వర్ధమాన రచయిత నన్ను ప్రశ్నించడం ఎంత బాధాకరం. నిజంగా చదవని వాళ్లకు చెబుతున్నాను. వెనకటితరం మహామహా రచయితల్నీ, కవులనీ వారివారి రచనలనీ కొద్దో గొప్పో తెలియచెప్పే 'గొప్ప' పుస్తకం 'కవన కుతూహలం' చదవండి చదివించండి... ఒక్క కవన కుతూహలాన్నే కాదు...

పుస్తకాల్ని చదువుదాం గౌరవిద్దాం. మనలోని మురికిని కడుక్కుందాం. ●